సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023





## చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు పలికాయి. మార్కెట్‌కు 26 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



## కిలో టమాటా రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.3.50, సరాసరిన రూ.6.50 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
37.6°/21.5°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### 15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



దుర్గాదేవి

**లేపాక్షి:** ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. రోజూ ఉదయం 8 గంటలకు సుప్రభాత సేవ, సప్తశతి పారాయణం, రుద్రాభిషేకం, శ్రీచక్రార్చన విశేష పూజా అలంకారాలు జరుగుతాయన్నారు. 11 గంటలకు నీరాజం, అష్టావాదానసేవ, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 15న మహాలక్ష్మి అలంకరణ, 16న గాయత్రి అలంకరణ, 17న అన్నపూర్ణేశ్వరి అలంకరణ, 18న లలితాదేవి అలంకరణ, 19న బాలా త్రిపురసుందరి అలంకరణ, 20న సరస్వతీదేవి అలంకరణ, 21న రాజరాజేశ్వరిదేవి అలంకరణ, 22న దుర్గాదేవి అలంకరణ, 23న మహిషాసురమర్దిని అలంకరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

### చదువుతో పాటు కళల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

**పుట్టపర్తి టౌన్:** ప్రతి విద్యార్థి చదువుతో పాటు కళల్లో కూడా రాణించాలని బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. బుక్కపట్నం డైట్ కళాశాలలో 11, 12 తేదీల్లో రెండు రోజులు నాటకీకరణ, జానపద నృత్యాలపై జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో నాటకీకరణలో బుక్కపట్నం కేజీబీవీ విద్యార్థులు ప్రథమ బహుమతి, గోరంట్ల కేజీబీవీ విద్యార్థులు ద్వితీయ బహుమతి, పుట్టపర్తి కేజీబీవి విద్యార్థులు తృతీయ బహుమతులు గెలుపొందారు. అలాగే జానపద నృత్యంలో కేజీబీవీ విద్యార్థులు ప్రథమ బహుమతి, సిద్దాపురం జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థులు ద్వితీయ బహుమతి, వజ్రకరూరు కమలపాడు ఎంపీపీ పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతులు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ నవంబర్ 7వ తేదీన కళా ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుల బృందం , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా పండుగ

ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి.. పోయాయి.. కానీ పేదల సొంతింటి కలను మాత్రం ఏ ప్రభుత్వం సాకారం చేయలేకపోయింది. రెక్కాడితేగాని డొక్కాడని వారు అద్దెలు కట్టలేక, గుడిసెల్లో ఉండలేక ఎన్నో ఏళ్ల నానా అవస్థలు పడ్డారు. వారి కష్టాలను కళ్లారా చూసినా సీఎం వైఎస్ జగన్ వారి కన్నీళ్ల తుడిచేలా నిర్ణయం తీసుకోవడంలో పేదల సొంతింటి కల సాకారమైంది.

- అట్టహాసంగా సామూహిక గృహ ప్రవేశాలు
- వర్చువల్ పద్ధతిలో ప్రారంభించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- జగనన్న పేదల పక్షమేనన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ
- సొంతింటి కల సాకారమవడంతో లబ్ధిదారుల హర్షం
- మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్న కలెక్టర్ అరుణ్‌బాబు



గోరంట్ల: మల్లాపల్లి సమీపంలో సామూహిక గృహప్రవేశాల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

**గోరంట్ల:** పేదల సొంతింటి కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేస్తోంది. పేదలందరికీ ఇల్లు పథకం కింద అర్హులందరికీ స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణంలో అన్ని విధాలా వారికి అండగా ఉండటంతో లబ్ధిదారులు సంతోషంగా ఇళ్లలోకి చేరుకుంటున్నారు. ఇందులో భాగంగానే గోరంట్ల మండలం మల్లాపల్లి సమీపంలో నిర్మించిన జగనన్న లేఅవుట్‌లో సామూహిక గృహాలను కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరజమ్మ, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి మల్లాపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**అర్హతే ప్రామాణికంగా లబ్ధి..**

ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద ఉండకూడదనే తలంపుతో దేశంలో ఎక్కడా లేనివిధంగా కుల,మత, రాజకీయలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలను గుర్తించి 31 లక్షల ఇళ్లను మంజూరు చేశారని పేర్కొన్నారు. పేదలకు మంచి చేయాలనే కోట్లాది రూపాయలు వెచ్చించి భూసేకరణ ద్వారా రైతుల భూములు తీసుకొని లేఅవుట్లు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అయితే పేదలకు మంచి జరగడం ఇష్టం లేని ప్రతి పక్ష నేత చంద్రబాబు కోర్టు స్టేల ద్వారా కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని విమర్శించారు. జిల్లాకు 74 వేల ఇళ్లు మంజూరు అయ్యాయని అందులో 8,500 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. గోరంట్ల మండలంలో దాదాపు 7 లేఅవుట్లతో పాటు సొంత స్థలం ఉన్న పేదలకు 2500 ఇళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. మల్లాపల్లి లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో 287 ఇళ్లు మంజూరుకాగా 187 ఇళ్లు పూర్తయినట్లు తెలిపారు.

**జగనన్నతోనే మహిళ సాధికారత సాధ్యం..**

మహిళ సాధికారతకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ ఎంతో కృషిచేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. మహిళా సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. పేదలందరికీ ఇల్లు పథకం కింద అక్కచెల్లెమ్మల పేరు మీద రూ.లక్షలు విలువ చేసే ఆస్తి దక్కేలా చేశారని చెప్పారు.

**మరిన్ని సదుపాయాలు కల్పిస్తాం..**

ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి జగనన్న కాలనీలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయలు కల్పించినట్లు చెప్పారు. జగనన్న కాలనీలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు మరిన్ని మౌలిక సదుపాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

**మౌలిక సదుపాయాల పరిశీలన..**

కలెక్టర్ అరుణ్‌బాబు , ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ , ప్రజాప్రతినిధులు, అధికారులు మల్లాపల్లి జగనన్న కాలనీని సందర్శించారు. మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి, మల్లాపల్లి సర్పంచ్ శివనంద, జెడ్పీటీసీ జయరాంనాయక్, ఎంపీపీ ప్రమీల, జిల్లా కోఆప్షన్ సభ్యులు బాషా, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, గోరంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డీఓ భాగ్యరేఖ, జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.



హాజరైన లబ్ధిదారులు



జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

### రీసోర్స్‌పర్సన్‌కు ప్రధాని అభినందన



ప్రధాన మంత్రి నుంచి వచ్చిన ప్రశంసాపత్రాన్ని శ్రీరాములకు అందజేస్తున్న ఎంఈఓలు

**ముదిగుబ్బ:** మండల కేంద్రానికి చెందిన క్లస్టర్ రీసోర్స్ పర్సన్ బి.శ్రీరాములును అభినందిస్తూ ప్రధాన మంత్రి మోదీ కార్యాలయం నుంచి ప్రత్యేకంగా లేఖ వచ్చింది. దేశంలో విద్యార్థుల పరీక్షల నిర్వహణ విధానంపై నిర్వహించిన పరీక్షాపే చర్చ కార్యక్రమంలో ముదిగుబ్బ మండలం నుంచి పాల్గొని క్లస్టర్ రీసోర్స్ పర్సన్ బి. శ్రీరాములు పలు సూచనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే శ్రీరాములును అభినందిస్తూ గురువారం ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి పోస్టల్ ద్వారా వచ్చిన అభినందన లేఖను ఎంఈఓలు కిరణ్మయి, రమణప్ప అందజేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా క్రీడలు, సాంకేతిక ఆవిష్కరణలు, స్టార్టప్‌లతో సహా యువత కోసం అనేక ఎంపికలు ఉద్భవించాయని శ్రీరాములు తెలిపారు. అందులో అంతులేని అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకునేలా చూడాలన్నారు. దేశాభివృద్ధిలో వాటిని నెరవేర్చడానికి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కూడా చాలా ముఖ్యమన్నారు.

### ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

**అనంతపురం ఎడ్యుకేషన్:** సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు తెలిపారు. రూ. 200 అపరాధ రుసుంతో ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. పదో తరగతిలో చేరేందుకు 14 ఏళ్లు నిండినవారు, ఇంటర్‌లో చేరేందుకు పదోతరగతి పూర్తయి 15 ఏళ్లు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## రైల్వే ఆస్తుల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న ఆరోమసింగ్ ఠాకూర్ (చిత్రంలో) డివిజనల్ కమిషనర్ మురళీకృష్ణ

**గుంతకల్లు:** రైల్వే ఆస్తులు, ప్రయాణికుల పరిరక్షణే ధ్యేయంగా ఆర్‌పీఎఫ్ పనిచేస్తోందని దక్షిణ మధ్య రైల్వే ఆర్‌పీఎఫ్ ఐజీ ఆరోమసింగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. తొలిసారిగా గుంతకల్లు డివిజన్ పర్యటనకు వచ్చిన ఆమె ఆర్‌పీఎఫ్ డివిజనల్ కమిషనర్ మురళీకృష్ణ, ఇతర అధికారులతో కలసి గురువారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థను అందిపుచ్చుకుని రైల్వే ఆస్తులు, ప్రయాణికుల రక్షణకు పెద్ద పీట వేసినట్లు వివరించారు. జోనల్ పరిధిలో ఎక్కువ రద్దీ ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, తిరుపతి రైల్వే స్టేషన్లలో సీసీ కెమెరాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సరికొత్త సాఫ్ట్‌వేర్ (ఎఫ్ఆర్ఎస్)ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. దీని ఆధారంగా రైల్వే స్టేషన్లు, పరిసరాల్లో పాత నేరస్తుల కదలికలను చాలా సులువుగా గుర్తుపట్టవచ్చునన్నారు. గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న దాదాపు 200 ఆర్‌పీఎఫ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గుంతకల్లు, తిరుపతి, రాయచూర్, ధర్మవరం పట్టణాల్లో ఆర్‌పీఎఫ్ బ్యారెక్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అనంతరం న్యూ మీటింగ్ చాంబర్ ఆర్‌పీఎఫ్‌ల పనితీరుపై డివిజన్ పరిధిలోని సీఐలు, ఇతర అధికారులతో సమీక్షించారు. అంతకు ముందు రైల్వేక్లబ్‌లో ఆర్‌పీఎఫ్ సమ్మేళనం ఏర్పాటు చేసి, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**నెట్టికంటి సన్నిధిలో ప్రత్యేకపూజలు..**

కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఆర్‌పీఎఫ్ ఐజీ ఆరోమసింగ్ ఠాకూర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో ఆమెకు అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజాలు నిర్వహించి, స్వామి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

## మహిళోదయం

- పట్టణాల్లో జగనన్న మార్టుల ఏర్పాటుకు సన్నాహాలు
- మహిళాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు
- ఉమ్మడి జిల్లాలో 5 చోట్ల ఏర్పాటుకు చర్యలు
- పట్టణ ఫెడరేషన్లకు నిర్వాహణ బాధ్యతలు



మహిళా సమాఖ్య ద్వారా ఏర్పాటయ్యే మార్టు

**హిందూపురం:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు పురోగతి సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక తోడ్పాటు అందిస్తోంది. మహిళా సంఘాలు పొదుపుతో పాటు వ్యాపార రంగాల్లోనూ రాణించేలా వనరులు సమకూరుస్తోంది. ఇందులో భాగంగానే 'జగనన్న మహిళా మార్టు'ల ఏర్పాటుకు కార్యచరణ చేపట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, గుంతకల్లు, కదిరి మున్సిపాలిటీల్లో మహిళా మార్టులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించడానికి మెప్మా (పేద నిర్మూలన సంస్థ) కసరత్తు ప్రారంభించింది.

**తక్కువ ధరలకే నిత్యావసరాలు..**

డ్వాక్రా పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో నడిచే మహిళా మార్టులో బయట మార్కెట్‌లో దుకాణాలకంటే తక్కువ ధరలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులు లభిస్తాయి. ఇందుకోసం రిలయన్స్, ఐటీసీ, హెచ్‌సీఎల్, తదితర కార్పొరేషన్ సంస్థలతో నేరుగా ఒప్పందం కుర్చుకున్నారు. సదరు సంస్థలు వస్తువులను నేరుగా దుకాణాలకే సరఫరా చేస్తాయి. తర్వాత హోల్‌సేల్ ధరలకే వస్తువులు అందుబాటులో ఉంచుతారు. వినియోగదారులకూ తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు దొరుకుతాయి. దీనివల్ల డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కానున్నారు.

**ప్రైవేటు మాల్స్‌కు ధీటుగా...**

పట్టణాల్లో అత్యధికంగా సర్కిల్‌కు ఒక్కటిగా ప్రైవేటు సూపర్ మార్కెట్లు వెలుస్తున్నాయి. జగనన్న మహిళా మార్టులు వాటికి ధీటుగా పోటీని తట్టుకుని నిలిచేలా ప్రభుత్వం తోడ్పాటు అందించనుంది. మార్టుల నిర్వాహణకు అవసరమైన భవనాలు ఆయా మున్సిపాల్టీల ద్వారా కేటాయించనున్నారు. పట్టణ ప్రధాన కూడళ్లలో సెంటర్లు ఏర్పాటు చేయడానికి మెప్మా అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. ఇప్పటికే భవనాలు, వాటి నిర్వాహణ బాధ్యతలు, ఇతరాలపై సమాయత్తంపై సమావేశాలు, చర్చలు నిర్వహించారు.

**డ్వాక్రాసంఘాల భాగస్వామ్యం..**

జగనన్న మహిళా మార్టుల నిర్వహణలో స్వయం సహాయక సంఘాల సభ్యులందరినీ భాగస్వామ్యం చేసేలా ప్రణాళిలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం 25 నుంచి 50 సంఘాలను కలిపి ఫెడరేషన్‌గా ఏర్పాటు చేస్తున్నారు. వీటిన్నంటిని పట్టణ సమాఖ్య పర్యవేక్షణ చేస్తుంది. సంఘాల్లో యాక్టివ్‌గా ఉన్న సభ్యులను ఎంపిక చేసుకుని కమిటీ ఏర్పాటు చేసి మార్టుల నిర్వాహణ బాధ్యతలు అప్పగిస్తారు.

**అందరికీ లాభాల పంపిణీ..**

మహిళల వాటాగా రూ.100 నుంచి రూ.500 దాకా సేకరిస్తారు. మిగిలిన మొత్తం స్త్రీ నిధి, బ్యాంకుల ద్వారా పెట్టుబడి రుణం పొందుతారు. వాటాదారులుగా చేరిన సభ్యులకు ప్రతి ఒక్కరికి వచ్చిన లాభాలు పంచుతారు. జిల్లా, పట్టణ అధికారుల పర్యవేక్షణలో సభ్యులందరికీ బాధ్యతగా సమాన అవకాశాలు, లాభాలు అందుతాయి.

**ప్రణాళికలు రూపొందిస్తున్నాం**



మహిళా మార్టులు ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందులో భాగంగా మున్సిపాలిటీల్లో భవనాలు గుర్తిస్తున్నాం. ఇప్పటికే హిందూపురం, ధర్మవరం, గుంతకల్లు ప్రాంతాల్లో గుర్తించాం. మిగిలిన మున్సిపాల్టీల్లోనూ భవనాల కోసం చూస్తున్నాం.

– విజయలక్ష్మి, మెప్మా పీడీ

## మెహ్రీన్ మెరిసె.. అనసూయ అదిరె

- మాంగళ్య షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో సందడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



అభిమానులకు కారులో నుంచి అభివాదం చేస్తున్న సినీతారలు

**ధర్మవరం అర్బన్:** సినీతారలు మెహ్రీన్, అనసూయ ధర్మవరంలో మెరిశారు. వారిని చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. సెల్ఫీలు దిగేందుకు యువకులు, మహిళలు పోటీ పడ్డారు. పట్టణంలో గురువారం మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మితో పాటు మెహ్రీన్, అనసూయ హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలనతో షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాంగళ్య షాపింగ్‌మాల్ డైరెక్టర్లు కాసం మల్లికార్జున్, కాసం నమశ్శివాయ, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుట్లూరు అరుణ మాట్లాడుతూ అతి తక్కువ ధరకే నాణ్యమైన వస్త్రాలు ఇవ్వడం తమ ప్రత్యేకత అన్నారు. పట్టణంలో బ్రాంచ్ ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పట్టువస్త్రాలకు పుట్టినిల్లైన ధర్మవరంలో ఏర్పాటైన మాంగళ్య షాపింగ్‌మాల్‌ను ప్రజలు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన చేతుల మీదుగా కేకు కట్ చేయించారు. కార్యక్రమంలో షాపింగ్‌మాల్ నిర్వాహకులు కార్తీక్, అరుణ్, మూర్తి, వరుణ్, విశాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నమోదుకు 15 వరకూ అవకాశం

- సద్వినియోగం చేసుకోవాలని డీఏఓ సుబ్బారావు సూచన



బీడుపల్లి వద్ద వరినాట్లు వేస్తున్న రైతులు


**పుట్టపర్తి అర్బన్:** రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అన్నదాతలు ఏ రకంగానూ నష్టపోకూడదన్న ఉద్దేశంతో ఏదో రకంగా వారిని ఆదుకుంటూనే ఉన్నారు. ఇందులో భాగంగా రైతులందరికీ మూడు విడతల్లో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.13,500 మొత్తాన్ని ఒక్కో రైతు ఖాతాలో నేరుగా జమ చేస్తున్నారు. ప్రతి ఏడాది కొత్త రైతులు వస్తుండటంతో వారికి కూడా మరో అవకాశం ఇచ్చారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడానికి నవరత్నాలు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఇందులో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం అమలు చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఏడాదికి మూడు విడతలుగా అక్టోబర్, జూన్, జనవరి మాసాల్లో నగదు అందజేస్తున్నారు. మొదటి విడత రూ.7500, రెండో విడత రూ.4000, మూడో విడత రూ.2000 అందజేస్తున్నారు.

**కొత్త వారి కోసం...**

కొత్తగా అర్హత సాధించిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఈనెల 15వ తేదీ లోపు భూమికి సంబంధించిన పత్రాలు, సాగుదారుహక్కు పత్రాలు, ఆధార్ కార్డు అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. ఈ ఏడాది భూమి కలిగిన రైతులతో పాటు అటవీ భూములు సాగు చేస్తున్న రైతులు, దేవదాయ భూములు సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులు తదితరులందరికీ రైతు భరోసా ఆర్థిక సహాయం అందిస్తున్నారు. మూడు రోజులే సమయ ఉండడంతో రైతులు త్వరపడాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. జిల్లాలో సన్నకారు రైతులు 1,58,870 మంది, చిన్నకారు రైతులు 1,20,008 మంది, మధ్యస్థ రైతులు 86,045 మంది, పెద్ద రైతులు 952 మంది ఉన్నారు. జిల్లాలో నికరంగా పంట విస్తీర్ణం సుమారు 3,25,068 హెక్టార్లుగా ఉంది.

# ఆరోగ్యానికి వెరీగుడ్డు

**సందర్భం:** నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం



**హిందూపురం అర్బన్:** గుడ్డు ఆరోగ్యానికి మంచిందని నిపుణులు అంటున్నారు. శిశువు ఎదగడానికి ఉపయోగపడే అన్ని రకాల పోషకాలు, వివిధ వ్యాధులతో పోరాడే వ్యాధి నిరోధక శక్తి అమ్మపాల నుంచే లభిస్తాయి. ఆ తర్వాతి స్థానం గుడ్డుదేనని పరిశోధనల్లో తేలింది. కేవలం శిశువు ఎదుగుదలకే కాదు... ప్రతి వ్యక్తికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే శక్తి గుడ్డులోనే ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. గుడ్డు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలను చైతన్య పరిచేలా 1996, అక్టోబర్ రెండో శుక్రవారం గుడ్డు దినోత్సవాన్ని అంతర్జాతీయ గుడ్డు కమిషన్ నిర్వహించింది. అప్పటి నుంచి ఏటా అక్టోబర్ రెండో శుక్రవారం గుడ్డు దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు.

**కండరాల పుష్టికి దోహదం..**

ఓ మనిషి సంవత్సరానికి తీసుకోవాల్సిన గుడ్లు 181 అయితే.. 91 గుడ్లు మాత్రమే తీసుకుంటున్నట్లుగా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నో కండర, కణజాల సముదాయంగా ఉన్న మానవ శరీరంలో కండరాలు పుష్టిగా ఎదగాలన్నా, అవయవాలన్నీ సక్రమంగా పనిచేయాలన్నా శరీరానికి ఎన్నో మినరల్స్, విటమిన్స్‌తోపాటు ప్రొటీన్స్ అవసరమూ ఎక్కువగా ఉంటుంది. వీటి కోసం తగిన మోతాదులో పౌష్టికాహారాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. ఈ పోషకాలన్నీ ఒక గుడ్డులోనే లభ్యమవుతుండడంతో మన ఆహారంలో ఓ భాగమైంది. ప్రభుత్వం సైతం అంగన్‌వాడీ కేంద్రాల మొదలు.. ప్రభుత్వ పాఠశాలన్నింటిలోనూ కోడి గుడ్డును ఆహారంగా చేర్చి ఉచితంగా అందజేస్తోంది.

**ఉమ్మడి జిల్లాలో 168 ఫారాలు..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనంతపురం, హిందూపురం, మడకశిర, కదిరి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పుట్టపర్తి, నల్లమాడ, గుంతకల్లు ప్రాంతాల్లో పౌల్ట్రీ పరిశ్రమ విస్తరించింది. దాదాపు 168 కోళ్ల ఫారాలున్నట్లుగా అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో 1.60 కోట్ల మేర కోళ్ల పెంపకాన్ని రైతులు చేపట్టారు. రోజూ 88 లక్షల కోడి గుడ్ల ఉత్పత్తి కొనసాగుతోంది. జిల్లా అవసరాలకు ఈ ఉత్పత్తి సరితూగక పోవడంతో పొరుగున ఉన్న కర్ణాటక నుంచి 1.13 కోట్ల కోడి గుడ్లను ప్రతి నెలా దిగుమతి చేసుకుంటున్నారు.

**పోషకాలు ఫుల్..**

రక్తపోటు నుంచి మధుమేహం వరకూ ఎన్నో సమస్యలను అదుపు చేయడంలో గుడ్డు చాలా కీలకంగా వ్యవహరిస్తోందని వైద్య నిపుణులు అంటున్నారు. క్యాల్షియం, విటమిన్ డీ లాంటి పోషకాలు, గర్భిణులకు అవసరమైన 'ఫోలిక్ యాసిడ్' కూడా గుడ్డులోనే ఎక్కువ మోతాదులో ఉందని వివరిస్తున్నారు. రోజువారీ విటమిన్-డి అవసరంలో ఐదో వంతు ఒక్క గుడ్డులోనే లభిస్తుందంటున్నారు. విటమిన్ బీ12 వల్ల రక్తహీనత బారి నుంచి బయటపడవచ్చునని, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని, జుట్టు నుంచి కండరాల వరకూ తలెత్తే ప్రతి సమస్యకూ చక్కటి పరిష్కారం గుడ్డు ద్వారానే లభ్యమవుతుందని అంటున్నారు.

### మంచి పౌష్టికాహారం



మంచి ఆరోగ్యంతో పాటు రోగనిరోధక శక్తి పెంపుదలలో గుడ్డు ప్రాధాన్యత చాలా ఎక్కువగా ఉంది. ప్రభుత్వం కూడా చిన్నారుల మొదలు గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కోడి గుడ్లను ఉచితంగా అందజేస్తోంది. హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నాలుగు దశల్లో 2,20,983 గుడ్లను పంపిణీ చేస్తున్నాం.

– రెడ్డి రమణమ్మ, సీడీపీఓ, హిందూపురం

### కంటి సమస్యలు తక్కువ



గుడ్డు తినేవారిలో కంటి సమస్యలు తక్కువగా ఉంటాయి. కాలేయ జబ్బులు, ధమనులు, నాడీ సమస్యలు తలెత్తకుండా గుడ్డులో ఉన్న కోలిన్ పని చేస్తుంది. కాల్షియం కూడా ఎక్కువగా ఉండడం వల్ల గర్భిణులకు గుడ్డు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. ఆరు నెలల వయసు నుంచి వృద్ధుల వరకూ అందరూ గుడ్డు తినవచ్చు.

– డాక్టర్ సతీష్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యుడు, మడకశిర

## క్లుప్తంగా

### కట్టడంపై నుంచి పడి బేల్దారి మృతి



మృతుడు ముస్కిన్

**పుట్టపర్తి టౌన్:** నిర్మాణంలో ఉన్న భవంతిపై నుంచి కిందపడి ఓ బేల్దారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం గ్రామానికి చెందిన ముస్కిన్ వలి (45)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భవన నిర్మాణ రంగంలో బేల్దారిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే పుట్టపర్తిలోని దుర్గమ్మ గుడి వద్ద చేపట్టిన అపార్ట్‌మెంట్ నిర్మాణ పనుల్లో పాల్గొనేవాడు. భవన మూడో అంతస్తులో గురువారం ఉదయం సెంట్రింగ్ తొలగిస్తూ అదుపు తప్పి పై నుంచి కింద పడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను తోటి కార్మికులు వెంటనే సత్యసాయి సూపర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ముస్కిన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు.

### డ్రిప్పు దొంగల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**నార్పల:** మండలంలోని పలు గ్రామాల్లో కొన్ని నెలలుగా డ్రిప్ పరికరాలను అపహరించుకెళుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి గురువారం వెల్లడించారు. పట్టుబడిన వారిలో నార్పల నివాసి నాగరాజు, బీకేఎస్ మండలం చెన్నంపల్లికి చెందిన బయన్న ఉన్నారు. వీరిద్దరూ గురువారం ఉదయం 97 కట్టల డ్రిప్ పైపులను అపహరించి, ఆటోలో తరలిస్తుండగా నార్పల క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఆటోతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, పైపులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### అంగన్‌వాడీ కార్యకర్త ఇంటర్వ్యూ రద్దుకు డిమాండ్



ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారికి వినతిపత్రాన్ని అందిస్తున్న గ్రామస్తులు

**రామగిరి:** మండలంలోని గంగంపల్లి అంగన్‌వాడీ కార్యకర్త ఇంటర్వ్యూను రద్దు చేయాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పుట్టపర్తిలోని ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకుని పీడీ లక్ష్మీకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త ఇంటర్వ్యూలకు వెళ్లకుండా అడ్డగించి బంధువులతో గృహ నిర్బంధం చేయించిన టీడీపీ నేత పన్నాగంపై గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనం తెలిసిందే. ఈ క్రమంలో గ్రామస్తులు ఏకమై బాధితురాలి పక్షాన నిలిచారు. జరిగిన అన్యాయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించి కార్యకర్త ఇంటర్వ్యూను రద్దు చేయాలని కోరారు.

### యువకుడి బలవన్మరణం

**హిందూపురం అర్బన్:** జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం మెలవాయి గ్రామానికి చెందిన రామ్మూర్తి (34)కి కొన్నేళ్ల క్రితం హిందూపురం మండలం మలుగూరుకు చెందిన పద్మావతితో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. అత్తారింట్లోనే ఉంటూ రోజూ గుడ్డంపల్లి సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమలో పనికి వెళ్లి వచ్చేవాడు. అయితే మద్యానికి బానిసైన రామ్మూర్తి గురువారం వేకువజామున మలుగూరు సమీపంలో పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, రామ్మూర్తి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

## స్వయం ఉపాధితోనే భవిత పదిలం



కార్యక్రమంలో పాల్గొన్న కెనరా బ్యాంక్ డీజీఎం రాంప్రసాదరెడ్డి, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి

**అనంతపురం:** ఉద్యోగం చేయడం కంటే పది మందికి ఉపాధి కల్పించే దిశగా ప్రతి ఒక్కరికీ వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న రూడ్‌సెట్ పనితీరు అభినందనీయమని కెనరా బ్యాంక్ డీజీఎం రాంప్రసాదరెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి రూడ్‌సెట్ అడ్వైయిజరీ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి, మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉచితంగా నాణ్యమైన శిక్షణతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తున్న రూడ్‌సెట్ సేవలను కొనియాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు జీవితంలో నిలదొక్కుకునేలా అనుక్షణం పర్యవేక్షిస్తున్న తీరును అభినందించారు. ఈ మూడు నెలల్లో నిర్దేశించిన అన్ని లక్ష్యాలను పూర్తి చేసినట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. రూడ్‌సెట్‌లో శిక్షణ పొంది రూ.10 లక్షల పెట్టుబడితో సొంతంగా టూ వీలర్ మెకానిక్ షాప్‌ను ఏర్పాటు చేసుకున్న మోహన్‌రెడ్డి, దాదాపీర్, అనూరాధ, షాహీన్‌ను అభినందించారు. కార్యక్రమంలో నాబార్డు డీజీఎం అనూరాధ, ఉభయ జిల్లా ఎల్‌డీఎంలు సత్యరాజు, రమణకుమార్, డీఐసీ జీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు 'జగనన్న' ఆరోగ్య భరోసా

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

**గోరంట్ల:** పేదలకు ఆరోగ్య భరోసా కల్పించే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారని పెనుకొండ ఎమ్మెల్యే ఎం.శంకరనారాయణ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నాణ్యమైన వైద్య సేవలను గ్రామస్థాయిలోనే అందజేస్తున్నారని కొనియాడారు. గోరంట్ల మండలం బూదిలిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, స్థానిక సర్పంచ్ రామాంజనేయులుతో కలసి ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టి పేదలకు కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన అడుగు జాడల్లోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ మరో అడుగు ముందుకేసి పేదలకు ఆరోగ్య భరోసానిస్తున్నారన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించి, వారికి నాణ్యమైన వైద్య పరీక్షలతో పాటు ఉచిత చికిత్సలూ అందజేస్తున్నారన్నారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఉన్నత శ్రేణి ఆస్పత్రులకు రెఫర్ చేసి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే బాధ్యతను జగన్ సర్కార్ తీసుకుందన్నారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, డీపీఓ విజయకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ బూదిలి వేణుగోపాలరెడ్డి, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, తహసీల్దార్ రంగనాయకులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### కూలీ ఆత్మహత్యాయత్నం



ఈరన్నను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**ధర్మవరం అర్బన్:** తీసుకున్న డబ్బుకు మూడింతలు అదనంగా చెల్లించాలన్న యజమాని డిమాండ్‌తో మనస్తాపం చెందిన ఓ కూలీ ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. వివరాలు.. ధర్మవరంలోని తిక్కస్వామినగర్ వద్ద ఉన్న ఇటుకల బట్టీలో కూలీగా పనిచేస్తున్న ఈరన్న తన యజమాని కృష్ణమూర్తి వద్ద రూ.26 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ మొత్తాన్ని కాకుండా రూ.1 లక్ష చెల్లించాలంటూ యజమాని డిమాండ్ చేయడమేకాక బెదిరింపులకు దిగడంతో దిక్కుతోచని ఈరన్న గురువారం ఉదయం కాలేజీ సర్కిల్‌లో కటౌట్ పైకి ఎక్కి కిందకు దూకాడు. అయితే కింద ఉన్న దుకాణంపై పడడంతో ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం జోక్యం చేసుకుని ఈరన్నకు నచ్చచెప్పారు. న్యాయం చేస్తామని భరోసానిచ్చారు.

### యువతి ఆత్మహత్య



మృతురాలు వెంగమ్మ

**ఓడీచెరువు:** తల్లి మందలింపుతో మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... నాలుగు రోజుల క్రితం తన తల్లితో కలసి నల్లచెరువుపల్లికి చేరుకున్న వైఎస్సార్ జిల్లా బద్వేల్ మండలానికి చెందిన వెంగమ్మ (26) బొగ్గులు కాల్చుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే ఆమె సక్రమంగా పని చేయకపోవడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన వెంగమ్మ బుధవారం విషపూరిత ద్రావకం తాగింది. విషయం గుర్తించిన తల్లి వెంటనే స్థానికుల సాయంతో హిందూపురంలోని ఆస్పత్రిలో చేర్పించింది. చికిత్సకు స్పందించక గురువారం ఆమె మృతిచెందింది. మృతురాలి తల్లి సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## మావోయిస్ట్ సందీప్ కుమార్‌కు రిమాండ్

**పుట్టపర్తి టౌన్:** మవోయిస్టు పార్టీ పశ్చిమ కనమల స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్ సంజయ్‌రావ్‌ను జిల్లా పోలీసులు గురువారం పుట్టపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో పెట్టగా, జడ్జి రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...జమ్ము కాశ్మీర్‌కు చెందిన సంజయ్‌దీప్‌రావ్, అలియాస్ సంజయ్‌రావ్ (59) ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీలో చేరి కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఈ క్రమంలోనే ఆ పార్టీ అతన్ని పశ్చిమ కనుమల స్పెషల్ జోన్ మెంబర్‌గా నియమించగా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టారు. పార్టీ కార్యాచరణలో భాగంగా దాడులకు ప్రణాళిక రచించడం, యువతను రిక్రూట్ చేయడం, శిక్షణ ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గత నెల సంజయ్‌రావ్ భార్య సరస్వతిని కొత్తచెరువు పోలీసులు ఓ కేసులో అరెస్టు చేశారు. ఇదే కేసులో సంబంధం ఉందన్న కారణంతో చెర్లపల్లి జైలులో ఉన్న సంజయ్‌రావ్‌ను పీటీ వారెంట్‌తో డీఎస్పీ వాసుదేవన్ జిల్లాకు తీసుకువచ్చి కోర్టు ముందు హాజరు పరిచారు. అనంతరం కోర్టు రిమాండ్‌కు ఆదేశించగా, మళ్లీ చర్లపల్లి జైలుకు తరలించారు.

### రేపు రాచపాలెం పుస్తకాల ఆవిష్కరణ

**అనంతపురం కల్చరల్:** ప్రసిద్ధ సాహితీ విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ఐదు దశాబ్దాల సాహితీ జీవనంపై వచ్చిన ప్రత్యేక సంచిక 'విమర్శా పునర్నవం' గ్రంథావిష్కరణ శనివారం జరుగనుంది. అనంతపురంలోని కొత్తూరు ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 14న ఉదయం 9.30 గంటలకు పుస్తకావిష్కరణ ఉంటుంది. అలాగే సాహిత్య విమర్శ గ్రంథాలు, మన నవలలు, మన కథానికలు పుస్తకాలనూ ప్రముఖులు ఆవిష్కరించనున్నారు. అనంతరం రెండు వేర్వేరు విభాగాల్లో జరిగే సాహితీ సమావేశాలకు అభ్యుదయ రచయితల సంఘం జాతీయ నాయకులు పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరి శివప్రసాద్, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా డాక్టర్ రాచపాలెం పిలుపునిచ్చారు.

### అగ్రి ఇంజినీరింగ్ విద్యార్థుల శిక్షణ పూర్తి



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు

**గార్లదిన్నె:** మండలంలోని దక్షిణ వ్యవసాయ క్షేత్ర యంత్రముల శిక్షణ, పరీక్షణ సంస్థలో మడకశిరలోని అగ్రి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులను ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారీ నాందేడ్ అభినందించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

### న్యాయవాదుల సంక్షేమ స్టాంపు రుసుం పెంపు రద్దునకు వినతి

**అనంతపురం:** ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ పెంచిన రూ.20 సంక్షేమ స్టాంపును రద్దు చేయాలని అనంతపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోరారు. డిమాండ్ సాధనలో భాగంగా అనంతపురం కోర్టు ప్రాంగణం ఎదురుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 8వ రోజు గురువారమూ కొనసాగాయి. దీక్షలో కూర్చొన్న న్యాయవాదులు ప్రకాష్‌రెడ్డి, కేఎల్‌వీ ప్రసాద్, బీఎల్ నారాయణరెడ్డి, మహేష్, రమాదేవికి మద్దతుగా అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, వెంకటరాముడు, కె.శ్రీనివాసరెడ్డి, బడా నారాయణరెడ్డి నిలిచారు. ధర్మవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ... ఇతర రాష్ట్రాల్లో న్యాయవాదుల సంక్షేమ స్టాంప్ రూ.25 నుంచి రూ.30లు మాత్రమే ఉందన్నారు. కానీ ఏపీలో ఇప్పటికే న్యాయవాదులు సంక్షేమ స్టాంపు రూ.100లు అమలులో ఉండగా, తిరిగి ప్రతి పిటీషన్‌పై రూ.20 అదనంగా చెల్లించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సబబు కాదన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహించుకోవాలని కోరారు.

## నేత్రదానం





నేత్రదానం చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) రంగనాయకులు(ఫైల్)

**ధర్మవరం అర్బన్:** మరణానంతరం నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించారు ధర్మవరంలోని కోటదాసరి వీధికి చెందిన రెవెన్యూ విశ్రాంత ఉద్యోగి రంగనాయకులు(64). వివరాలు... గురువారం ఉదయం రంగనాయకులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం సభ్యులు అక్కడకు చేరుకుని నేత్రదానంపై మృతుడి కుటుంబసభ్యులను చైతన్య పరిచారు. వారి అంగీకారం తీసుకున్న అనంతరం హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ నాగరాజు సాయంతో రంగనాయకులు మృతదేహం నుంచి నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి అంగీకరించిన రంగనాయకులు భార్య రెడ్డమ్మ, కుమారులు ఆనంద్, ప్రసాద్, కుమార్తె దుర్గ, అల్లుడు సురేష్‌ను విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు సురేష్, మాధవ, సభ్యులు అభినందించారు.

## బైక్ చోరీ కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

**అనంతపురం:** ద్విచక్ర వాహనాలు అపహరించుకెళ్లిన అంశానికి సంబంధించిన కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ అనంతపురం స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి సుజన్‌కుమార్ తీర్పు వెలువరించారు. ఈ ఏడాది ఆరంభంలో అనంతపురం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరు బైక్‌లను అపహరించుకెళ్లిన కేసులో పక్కా ఆధారాలతో పోలీసులకు గార్లదిన్నె మండలం పెనకచర్ల గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్, రాజశేఖర్ పట్టుబడ్డారు. ఈ కేసు దర్యాప్తును ఎస్ఐ వలీబాషు పూర్తి చేసి నివేదికను న్యాయమూర్తికి సమర్పించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ దుర్గాదేవి వాదనలు వినిపించారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సుజన్‌కుమార్ తీర్పు వెలువరించారు.

## ఇనుప చువ్వ గుచ్చుకుని బాలికకు గాయాలు



చికిత్స అనంతరం తల్లి చెంత చేరిన బాలిక అంజుమ్‌తాజ్

**అనంతపురం క్రైం:** ఇనుప చువ్వ గుచ్చుకుని ఓ బాలిక గాయపడింది. వివరాలు.. అనంతపురంలోని ముత్యాలమ్మ కాలనీలో నివాసముంటున్న అలియా కుమార్తె అంజుమ్‌తాజ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి చేరుకున్న ఆ బాలిక గేటుకు తాళం వేసి ఉండడంతో ఎక్కి లోపలకు వెళ్లే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో ప్రమాదవశాత్తు గేటు ఇనుప చువ్వలు గొంతుకు గుచ్చుకుని గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే బాలికను సర్వజనాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న తల్లి పని ప్రాంతం నుంచి నేరుగా ఆస్పత్రికి చేరుకుంది. బాలిక పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న అనంతపురం మూడో పట్టణ పోలీసులు అక్కడుకు చేరుకుని పరిశీలించారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**యాడికి:** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్ఐ శేషగిరి, ఏఈఈ రవీంద్రనాథ్ తెలిపారు. వివరాలను వారు గురువారం వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో గురువారం ఉదయం యాడికి మండలం చందన గ్రామం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో యాడికి నుంచి నంద్యాల జిల్లా ప్యాపిలి వైపుగా వెళుతున్న బొలెరో వాహనాన్ని ఆపి పరిశీలించగా 82 బస్తాల్లో 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లుగా వెలుగు చూసింది. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీఎస్‌డీటీ సూర్యనారాయణకు అప్పగించారు. అనంతరం విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు బొలెరో డ్రైవర్ శివకుమార్, బియ్యం తరలింపుదారు కృష్ణకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**136 బ్యాగుల బియ్యం స్వాధీనం**

**శింగనమల:** నార్పల, శింగనమల మండలాల్లో గురువారం విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 136 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. నార్పలలో నివాసముంటున్న నాగమణి వద్ద 103 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, కుళ్లాయిరెడ్డి, సీఎస్‌డీటీ రాజశేఖర్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే శింగనమల మండలం లోలూరు క్రాస్ వద్ద గురువారం సాయంత్రం శ్రీనివాసులు ఇంటిలో 33 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి గోదాముకు తరలించారు. నిందితులపై కేసు నమోదుకు పోలీసులకు సిఫారసు చేసినట్లు విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

### పాముకాటుతో రైతు మృతి

**శింగనమల:** మండలంలోని ఏకుల నాగేపల్లికి చెందిన రైతు మల్లికార్జునరెడ్డి(46) పాముకాటుతో మృతి చెందాడు. తాను సాగు చేసిన బెండ తోటలో గురువారం ఉదయం పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించకఆయన మృతి చెందాడు. ఘటనపై శింగనమల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మల్లికార్జునరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

### వేధింపుల కేసు నమోదు

**తలుపుల:** అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడంటూ బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, కుటుంబసభ్యులపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు తలుపుల పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని ఓబుళరెడ్డిపల్లికి చెందిన నారాయణ, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె పాముల వాణికి రెండేళ్ల క్రితం అన్నమయ్య జిల్లా గొల్లపల్లికి చెందిన ఆంజనేయులుతో వివాహమైంది. పెళ్లి సమయంలో వరకట్నం కింద 10 తులాల బంగారు నగలు, రూ. 3 లక్షల నగదును వాణి తల్లిదండ్రులు ఇచ్చారు. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం కోసం వేధింపులు మొదలయ్యాయి. రూ.2 లక్షలు ఇస్తే తప్ప కాపురానికి రాకూడదంటూ భర్త, ఆయన కుటుంబసభ్యులు హెచ్చరించడంతో ఎనిమిది నెలల క్రితం ఆమె పుట్టింటికి చేరుకుంది. అప్పటి నుంచి పలు దఫాలుగా పెద్దల పంచాయితీ జరిగినా ఆంజనేయులులో మార్పు రాకపోవడంతో అదనపు కట్నం వేధింపులపై పోలీసులకు బాధితురాలు వాణి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు భర్త ఆంజనేయులుతో పాటు అతని అన్న శ్రీనివాసులు, వదిన మంజులపై గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ గుర్రప్ప తెలిపారు.